www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 11 నవంబర్ 2025
5
అన్నమయ్య

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం: డిఆర్ఒ

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను సంతృప్తి స్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికనిర్వహించారు. అర్జీదారులు తమ సమస్యల పరిష్కారం రానికి డిఆర్ఒకు వివిధ రకాలఅర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రతి అర్జీని నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. నాణ్యతతో కూడిన పరిష్కార మార్గం చూపేలా అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి సమస్యలను పరిష్కరించాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న, సంక్లిష్టమైన అర్జీలను వదిలిపెట్టకుండా నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖా స్తులను సంతృప్తి స్థాయిలో వేగవంతంగా, నాణ్యతతో బియాండ్ ఎస్ఎల్ఎకి వెళ్లకుండా పరిష్కరించాలని తెలిపారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

నష్ట పరిహారం చెల్లిస్తారా..
భూములు వెనక్కు ఇస్తారా?

- వ్య.కా.స రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం రైతుల దగ్గర తీసుకున్న భూములకు నష్టపరిహారం ఇస్తారా లేదా భూములు వెనక్కు ఇస్తారా? అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌కు ముదివేడు రిజర్వాయర్ నిర్వాసిత రైతుల వేడుకోలు నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం రైతుల దగ్గర తీసుకున్న భూములకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా గత ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టిందన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి పార్టీలు రైతులకు అన్యాయం చేస్తున్నారని అనేక ప్రకటనలు చేశారని, అధికారంలోకి వచ్చి దాదాపుగా 20 నెలలు అవుతున్న ఇప్పటివరకు ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కారణంగా ముంపుకు గురవుతున్న గ్రామాల అభివృద్ధి గురించి గానీ, రైతులకు నష్టపరిహారం గురించి ఒక్క ప్రకటన కూడా చేయలేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో ఆర్ అండ్ బి కార్యాలయం, ఇరిగేషన్ కార్యాలయం, సెక్రటరేట్‌లో అధికారులను, జిల్లా అధికారులను కలిసి విన్నవించిన ఫలితంగా 27 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించారే తప్ప మిగిలిన వారి గురించి ఎలాంటి ప్రస్తావన చేయలేదన్నారు. ఇరిగేషన్ అధికారులు, హంద్రీ-నీవా ప్రాజెక్టు అధికారులు, రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు నెపం వేసుకొంటూ ప్రజలను ముంచేశారని అధికారుల ఘన కార్యానికి కొత్తపల్లి, దిగువసితివారిపల్లి గ్రామాలు ప్రజలు ప్రస్తుతం నడవడానికి కూడా వీలులేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపరిహారం చెల్లించాలని రైతుల మీద ఆధారపడి ఉన్న వ్యవసాయ కూలీలకు పరిహారం చెల్లించాలని నిర్వాసితులు అందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని లేకుంటే రైతులకు భూములు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఒ మధుసూదనరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సుధీర్ కుమార్, ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులు శ్రీనివాసులు, రాజేష్, వెంకట్ రెడ్డి, నరసింహులు, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

నిర్వాసితులతో కలిసి డిఆర్ఒకు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసులు

సిఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ముఖ్యమంత్రి చంద్రబాబు చిన్నమండెం పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో కలిసి హెలిప్యాడ్, బిసి కాలనీ, టిడ్కో ఇల్లు, ప్రజా వేదిక, పార్టీ కేడర్ సమావేశ ప్రదేశాలను, కాన్వాయ్ మార్గాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. దీనికి సంబంధించి అడ్వాన్స్ సెక్యూరిటీ లైజనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఎలాంటి అంతరాయం లేకుండా పర్యటన విజయవంతంగా జరిగేందుకు భద్రత ప్రణాళికలను పటిష్టంగా అమలు చేసి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా బాంబ్ డిస్పోజల్ టీం, డాగ్ స్క్వాడ్, స్పెషల్ పార్టీ పోలీసులతో జల్లెడ పడుతున్నామని చెప్పారు. ఈ ప్రక్రియ పర్యటన పూర్తయ్యేంతవరకు నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

సిఎం పర్యటన ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పి

సిఎం పర్యటనను అన్ని శాఖల అధికారులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఎస్‌పి వెంకటాద్రి, ఎఆర్ అదనపు ఎస్‌పి, ఎస్ఎస్ఎస్ కృష్ణారావు, రాజంపేట, మదనపల్లి సబ్ కలెక్టర్లు, ఎఎస్‌పిలు, డిఎస్‌పిలు, పోలీస్ సిబ్బంది, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాలకు కృషి చేయాలి

కెజిబివి రాష్ట్ర సంచాలకులు దేవానంద్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న దేవానంద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

పదవ తరగతి, ఇంటర్‌లో విద్యార్థులు 100శాతం ఫలితాలు సాధించే దుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల రాష్ట్ర సంచాలకులు డి.దేవానంద్‌రెడ్డి సూచించారు. జిల్లాలోని 22 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల ప్రిన్సిపల్స్‌తో సోమవారం ఉదయం డైట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదోతరగతి, ఇంటర్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణతను సాధించేందుకు జూలై15 నుంచే విజయపథం కార్యక్రమాన్ని ప్రారంభించామని దాన్ని పటిష్టంగా అమలు చేయవలసిన బాధ్యత ప్రిన్సిపల్స్‌పై ఉందన్నారు. గతంలో పరీక్షలకు ముందు మాత్రమే ప్రత్యేక తరగతులు నిర్వహిం చేవారని, ప్రస్తుతం మాత్రం సంవత్సరం ప్రారంభం నుంచే రోజువారీ పరీక్షలు, ఉద యం నుంచి రాత్రి పది గంటల వరకు స్టడీ అవర్స్ వంటి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ముఖ్యమైన పాఠ్యాంశాలను ప్రత్యేకంగా బోధించాలన్నారు. వారు కూడా ఉత్తీర్ణులు అయ్యేవిధంగా చూడాలన్నారు. భవిష్యత్తులో కూడా ఉత్తమ ఫలితాలు సాధించడానికి పదో తరగతి నుంచే కాకుండా ఆరవ తరగతి నుంచే కనీస సామర్థ్యాలు సాధించే విధంగా బోధన చేసి పునాది బలంగా ఉండేలా చూడాలని ఆయన సూచించారు. ఇందుకోసం ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతిభ గల విద్యార్థులను మరింత ప్రోత్సహించి షైనింగ్ స్టార్ అవార్డ్స్ సాధించే దిశగా పనిచేయాలన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు వారంలో ఒకరోజు పదో తరగతి పాఠ్యాంశాలను బోధించి వాటిపై పరీక్ష పెట్టాలన్నారు. దాంతో వచ్చే ఏడాది పదో తరగతిలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించే అవకాశం ఉందన్నారు. పాఠశాలల్లో క్రమం తప్పకుండా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పిచ్చి మొక్కలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భోజనం వండే టప్పుడు, వడ్డించేటప్పుడు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. త్వరలో అన్ని పాఠశాలల్లో సిసి కెమెరాలను ఏర్పాటుచేసి వాటి ద్వారా జిల్లా, రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిఇఒ సుబ్రహ్మణ్యం, స్పోర్ట్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, జిసిడిఒ సుమతి, అసిస్టెంట్ జిసిడిఒ యశోద, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు చంద్రశేఖర్, జనార్ధన్, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

బ్రౌన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విసి రాజేశ్వర్, సాహితీ ప్రియులు

తెలుగు దీపానికి శాశ్వత వెలుగునిచ్చిన
మహనీయుడు సిపిబ్రౌన్ : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగు భాషా సాహిత్యాలు తాళపత్రాల్లో అగ్గిపురుగులకు ఆహు తవుతున్న సందర్భంలో తెలుగు దీపానికి శాశ్వత వెలుగునిచ్చిన మహ నీయుడు సిపిబ్రౌన్ అని, తెలుగు భాషా సాహి త్యాలకు ఎనలేని సేవ చేసిన సి.పి.బ్రౌన్ జయంతిని ప్రభుత్వం రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించడం హర్షణీయమని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. వైవీయూ ఆధ్వర్యంలోని సోమవారం 'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ 227వ జయంతిని నిర్వహించారు. ముందుగా రాజీవ్ మార్గ్‌లోని బ్రౌన్ విగ్రహానికి, సమావేశమందిరంలోని సి.పి.బ్రౌన్ చిత్రపటానికి అతిథులతో కలసి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని అన్నారు. సుమారు 15 మంది పండితులను పోషించి కడప గడపలో ఆయన సాహిత్య యజ్ఞాన్ని నిర్వహించారన్నారు. బ్రౌన్ నివసించిన బంగ్లాశిథిలాలను డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి స్థలదాత సి.కె.సంపత్ కుమార్, జి.కృష్ణమూర్తి, జె.సి.సుబ్బయ్య, ఎన్.సి.రామసుబ్బారెడ్డి, కట్టా నరసింహులు లాంటి ప్రముఖులతో కలసి సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయమనే జ్ఞానసౌధాన్ని నిర్మించి చిరకీర్తుల య్యారన్నారు. విశిష్ట అతిథి, యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాల కోసం తన జీతాన్ని, జీవితాన్ని త్యాగం చేసిన త్యాగమూర్తి సి.పి.బ్రౌన్ అని అన్నారు. ఒక విదేశీయుడి జయంతిని తెలుగు ప్రజలు ఆనందంతో నిర్వహించడం బ్రౌన్ కృషికి, ఆయన పట్ల ప్రజలకున్న కృతజ్ఞతకు తార్కాణమన్నారు. సభాధ్యక్షులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ డేవిడ్ బ్రౌన్, కౌలే దంపతులకు రెండవ సంతానంగా సి.పి.బ్రౌన్ జన్మించారన్నారు. మద్రాసులో శిక్షణలో ఉన్నప్పుడు తొలిసారిగా వెలగపూడి కోదండరామయ్య పంతులు దగ్గర తెలుగు నేర్చుకున్నారన్నారు. తాళపత్రాల్లో ఉన్న వేమన పద్యాలను సేకరించి, 'వర్సెస్ ఆఫ్ వేమన' అనే పేరుతో ఆంగ్లంలోకి అనువదించి విశ్వకవిని చేశారన్నారు. అతిథులను సాహితీవేత్త ఎస్.ఆర్.ప్రతాప రెడ్డిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి సభా సమన్వయం చేశారు. జానమద్ది విజయభాస్కర్, విజయలక్ష్మి దంపతులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శతజయంతిని పురస్కరించుకుని విశ్వవిద్యాలయ అధికారులను, బ్రౌన్ గ్రంథాలయ సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో తెలుగుశాఖ ఆచార్యులు ఎన్.ఈశ్వరరెడ్డి, ఎం.ఎం.వినోదిని, పి.రమాదేవి, పుత్తా పుల్లారెడ్డి, డాక్టర్ పుత్తా బాలిరెడ్డి, తెలుగు పరిశోధక విద్యార్థులు, బ్రౌన్ గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, నాగరాజు, ఎస్‌కెఆర్ %డ% ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, గానుగపెంట హనుమంతరావు, ఐజాక్, కొండూరు జనార్ధన రాజు, కొత్తపల్లి రామాంజనేయులు పాల్గొన్నారు

టిప్పు సుల్తాన్ గొప్ప దేశభక్తుడు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మాతృభూమి రక్షణ కోసం, బ్రిటిష్ వారిని చెండాడుతూ యుద్ధ రంగంలో కన్నుమూసిన ప్రథమ స్వదేశీ యోధుడు టిప్పు సుల్తాన్ గొప్ప దేశభక్తుడని విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం. శివప్రసాద్ తెలిపారు. టిప్పు సుల్తాన్ జయంతిని స్థానిక బెంగళూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద వీసీకే పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిపూ సుల్తాన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ మాతృభూమి నుండి బ్రిటీషర్లను తరిమికొట్టేందుకు పోరుబాటను ఎన్నుకున్న టిప్పు సుల్తాన్, జాతీయ భావనలతో స్వదేశీ పాలకుల ఐక్య సంఘటన నిర్మించేందుకు ప్రయత్నించారని చెప్పారు. యుద్ధ తంత్ర నిపుణుడిగా, అసమాన పోరాట యోధుడిగా మాత్రమే కాకుండా, జనరంజక పాలకుడిగా, సాహిత్య వేత్తగా, రచయితగా, పత్రికా సంపాదకుడిగా, పుస్తక ప్రేమికుడిగా, సంఘ సంస్కర్తగా, లౌకిక ప్రభువుగా, అంతర్జాతీయ వ్యవహారాల దక్షుడిగా, రాజనీతి కోవిదుడిగా పేరుగాంచారన్నారు. మాతృభూమి రక్షణ కోసం, బ్రిటిష్ సేనలను చీల్చి చెండాడుతూ యుద్ధ భూమిలో కన్నుమూసిన ప్రథమ స్వదేశీ యోధుడిగా టిప్పు సుల్తాన్ నిలిచారని చెప్పారు. ఆయన చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కర్ణాటక నేత రమేష్, విసికె పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముత్యాల మోహన్, స్థానిక నాయకులు తెట్టు శ్రీనివాసులు, తలారి కృష్ణ, బురుజు రెడ్డిప్రసాద్, క్రాంతి పాల్గొన్నారు.

టిప్పు సుల్తాన్ జయంతి వేడుకల్లో విసికె నేతలు

దత్తత అవగాహన పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాయచోటి

స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దత్తత అవగాహన కార్యక్రమాలు 2025 గోడ పత్రికలు విడుదల ఎడి సర్వే భరత్ కుమార్, డ్వామా పీడీ వెంకటరత్నం, ఐసిడిఎస్ అధికారి హైమావతి జిల్లా అధికారులతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారిమధుసూదన్‌రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ దత్తత అవగాహన కార్యక్రమం-2025 కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం నవంబర్ మాసంలో జిల్లా,మండల, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగు తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తును నిర్మిద్దాం అడ్డంకులతో కాదు, పూర్తి సంరక్షణతో అనే నినాదంతో, ప్రతి బిడ్డ ముఖ్యం అనే ఉద్దేశంతో దత్తత తీసుకోవడాన్ని బలోపేతం చేయడం, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు కుటుంబ ఆధారిత సంరక్షణ అందించే విధంగా అవగాహన కార్యక్రమాల ద్వారా తెలియ జేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల విత్‌డ్రాకు అనుమతినివ్వాలి

ప్రజాశక్తి-రాయచోటి

నియోజకవర్గంలోని పంచాయతీ విధులను విత్ డ్రా చేసుకున్నందుకు అనుమతులు ఇవ్వాలని సర్పంచులు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పిజిఆర్ ఎస్‌లో డిఆర్ఒ మధుసూదన్ రావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు 15 ఫైనాన్స్ నిధులను, జన రల్ ఫండ్ నిధులను 40 రోజుల క్రితం పంచాయతీలకు విడుదల చేసిందిన్నారు. జిల్లాలో మిగతా నియోజకవర్గాలలో సంబంధిత అధికారులు గ్రామపంచాయతీ సర్పంచులకు డ్రా చేసి ఇచ్చారని పేర్కొన్నారు. రాయచోటి నియోజక వర్గంలోని రాయచోటి, గాలివీడు, చిన్నమండెం, రామాపురం, సంబేపల్లి, లక్కిరెడ్డిపల్లి, మండ లాలలోని సర్పంచులకు నిధులను డ్రా చేసుకునే అధికారం ఉన్న సంబంధిత ప్రభుత్వ అధికారులు చొరవ చూపలేదున్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నిక కాబడిన సర్పంచులు, గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు సొంత నిధులతో అభివృద్ధి చేశారన్నారు. ప్రజలకు తాగునీటి అవసరాలు, గ్రామలలో వీధిలైట్లు, పరిసరాల శుభ్రత, పారిశుద్ధ్యం పనులు చేయుటకు ప్రభుత్వం నిధులు సమయానికి ఇవ్వక పోయినా అప్పులు చేసి ప్రజలకు అవసరాలు తీర్చామన్నారు. గ్రామాలను అదుకొన్న గ్రామ ప్రథమ పౌరులకు బిల్లులు రాకుండా కొందరు నియోజక వర్గ అధికారులు, అధికార పార్టీ నాయకులు అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. గ్రామపంచాయతీలలో విద్యుత్ బిల్లులు, వీధిలైట్ల బిల్లులు, గ్రీన్ అంబాసిడర్లకు గౌరవ వేతనం ఇవ్వడానికి మేము అధికారులకు సహకరిం చామన్నారు. అయినప్పటికీ తాము గ్రామంలో వివిధ పనులకు ఖర్చు చేసిన నిధులను డ్రా చేసుకొనుటకు అధికారులు సహకరించడం లేదన్నారు. తమకు న్యాయం చేకూర్చాలని డిఆర్ఒను కోరినట్లు తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్ నిశాంత్ కుమార్, డిపిఒ రాధమ్మ దృష్టికి తీసుకెళతానని డిఆర్ఒ హామీనిచ్చారని తెలిపారు.

శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని
అనుమానాస్పద మృతి

- పాఠశాల వారే చంపారంటూ తల్లిదండ్రుల ఆరోపణ
- ఆందోళనను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలో ఉన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెంది. వివరాలు.. తొండూరు మండలం పాలూరు గ్రామానికి చెందిన కల్లూరు రవిశంకర్‌రెడ్డి కుమార్తె కల్లూరి జస్వంతి చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలోనే హాస్టల్‌లోనే ఉంటూ 9వ తరగతి చదువుతోంది. రోజుమాదిరిగానే ఆమె సోమవారం ఉదయం స్టడీ అవర్‌లో ఉండి 6.30 గంటలకు తన హాస్టల్ రూమ్‌కు వెళ్లి గడియ పెట్టుకుంది. ఉదయం 6.50 అయినప్పటికీ జస్వంతి బయటకు రాకపోవడంతో తోటి విద్యార్థి తలుపు తీసేందుకు యత్నించింది, ఎంతకూ తెరుచుకోకపోవడంతో కిటికిలో నుంచి చూసింది. అప్పటికే రూములో ఫ్యాన్‌కు ఊరేసుకుని వేలాడుతూ జస్వంతి కన్పించడంతో విద్యార్థి వెంటనే కేర్‌టేకర్‌కు చెప్పింది. హుటాహుటీనా వచ్చి తలుపులను బలంగా తన్ని ఫ్యాన్‌కు వేలాడుతున్న జస్వంతిని కిందికి దించి వెంటనే ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయిందని చెప్పారు. పాఠశాల యాజమన్యాం అక్కడి నుంచి మార్చురికీ తరలించి విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు.

రిమ్స్ వద్ద ఉద్రిక్తత..మృతదేహంతో ర్యాలీ

విద్యార్థి జస్వంతి ఆత్మహత్యపై ఆమె తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల యాజమాన్యమే తమ బిడ్డను చంపిందంటూ తండ్రి రవిశంకర్‌రెడ్డి ఆరోపించారు. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు రిమ్స్ మార్చురీ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి జస్వంతి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు స్ట్రక్చర్‌పై మోసుకుని రిమ్స్ మెయిన్ గేట్ల వద్దకు వచ్చారు. అక్కడ పోలీసులు కాసేకు గేట్లు వేయడంతో వాటిని తొలగించుకుని మెయిన్ రోడ్డుపై ర్యాలీగా వస్తుండగా మార్గ మధ్యలో పోలీసులు అడ్డుకుని వారిని నచ్చజెప్పి తిరిగి మృతదేహాన్ని మార్చురీకి తిరిగి పంపారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సిఐ బాల మద్దిలేటి తెలిపారు. పాఠశాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి : ఎస్ఎఫ్ఐ

కడప అర్బన్ : విద్యార్థిని మృతికి కారకులైన పాఠశాల యాజమాన్యంపై శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి పేర్కొన్నారు. విద్యార్థి చనిపోయిన విషయాన్ని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. విద్యార్థిని మరణానికి చైతన్య విద్యాసంస్థలం యజమాన్యం కారణమని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అసలైన దోషులను పట్టుకుని వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

మృతిచెందిన విద్యార్థి జస్వంతి (ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో)

ఆత్మహత్య కేంద్రాలుగా కార్పొరేట్ విద్యాసంస్థలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా కేంద్రాలు కాకుండా ఆత్మహత్య కేంద్రాలుగా మారాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ సర్వేపల్లి ఉన్నారు. సోమవారం కడప జిల్లాలోని శ్రీ చైతన్య కె7 హాస్టల్ క్యాంపస్‌లో జస్వంతి అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుందన్నారు. ఆ హాస్టల్ క్యాంపస్ కు ఎలాంటి అనుమతులు లేవని ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్, ఆర్ఐ, ఎజిఎంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. 9వ తరగతి చదువుతున్న జస్వంతి ఆత్మహత్య లేక హత్య అనే కోణంలో పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి శంషుద్దీన్ పాఠశాల ఆవరణంలో రాకుండా అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. విద్యావ్యవస్థను ఏ స్థాయిలో శ్రీ చైతన్య, నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను ధ్వంసం చేస్తున్నారో స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యల పైన సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోని ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో శ్రీ చైతన్య, నారాయణ లాంటి కార్పొరేట్ విద్యాసంస్థల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

దేశాభివృద్ధే యువత ధ్యేయం కావాలి

-సినీ నటుడు అలీ

ప్రజాశక్తి-పీలేరు : భారతదేశ అభివృద్ధి యువత ధ్యేయం కావాలని ప్రముఖ సినీ నటుడు అలీ తెలిపారు. కడపలో ప్రారంభమైన అమీన్ పీర్ పెద్దదర్గా ఉరుసు ఉత్స వాలకు హాజరైన సినీ నటుడు అలీని పీలేరు నియోజకవర్గానికి చెందిన మైనారిటీ నాయకులు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశాన్ని ప్రేమించాలని, భారతదేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పాలన్నారు. సర్వ మతాల సమాహారంగా పరిమళిస్తున్న మన దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని, ముఖ్యంగా సామరస్యాన్ని, సోదర భావాన్ని అలవర్చుకోవాలన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామం ప్రపంచ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంతరించుకుందని, నాటి జాతీయ నాయకుల కలలు, ఆశయాలను సాఫల్యం చేసే దిశగా యువత నడుచుకోవాలన్నారు. దేశాభివృద్ధిలో యువత, విద్యార్థుల పాత్ర కీలకమైనదని, యువత తలుచుకుంటే ఏదీ అసాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో పీలేరు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాష, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, కేంద్ర ఉక్కు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అలీ భాయ్, నాయకులు ఆబీద్, కాలేషా, జాకీర్, అమిన్ పీర్, సమీ, ఇమ్రాన్, యూసుఫ్, హరిప్రసాద్ రెడ్డి, రమణ, మణి పాల్గొన్నారు

అలీని కలిసిన మైనార్టీ నాయకులు

విలేకరిపై దాడి అమానుషం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

హిందూపురంలోని చిలమత్తూరులో పని చేస్తున్న ప్రజాశక్తి విలేకరి శంకర్‌పై దాడి చేసి గాయపరిచి హత్య చేయబోయిన టిడిపి నాయకులపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలకు ప్రజలకు వారధిగా పని చేస్తున్న రాజ్యాంగ యంత్రాంగంలో ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభంగా ఉన్న మీడియా పట్ల టిడిపి గుండాల దాడిని రాజ్యాంగం మీద దాడిగా పరిగనించి కేసు నమోదు చేయాలన్నారు. ఆదివారం ఎన్ఆర్ఇజిఎస్ పరిధిలోని రూ.45 లక్షల సిసిరోడ్డు నాణ్యత మీద వార్త రాసిన ప్రజాశక్తి విలేకరి శంకర్‌ను టిడిపి నాయకులు అధికారపార్టీకి చెందిన వారు కాబట్టి ఏం చేసిన చెల్లు బాటు అవుతుందనే విధంగా నాగరాజు అతని అనుచరులు ఇంటికెళ్లి బెదిరించి సెల్ ఫోన్ లాక్కొని బెల్టు కట్టెలతో చట్టాన్ని చేతిలోకి తీసుకుని ఇష్టం వచ్చిన రీతిలో దాడి చేయడం హేయమైన చర్యని పేర్కొన్నారు. వార్తలో వాస్తవం లేకపోతే కేసు పెట్టాలని ప్రజాశక్తి అధిష్టానంకు ఫిర్యాదు చేయాలని చట్టాన్ని అతిక్రమించి దాడులు చేయడం సరికాదన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం విలేకరుల మీద దాడులు ఆపాలని, వారికి రక్షణ చట్టాలు తేవాలని కోరారు. చిలమత్తూరు ఎస్ఐ వెంటనే దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగభూషణం, రమణయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

పెద్దచెరువు కట్ట వద్ద వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పెద్దచెరువు వద్ద పారిశుద్ధ్య పనులు

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గోరాన్ చెరువు సచివాలయ పరిధిలోని గాలివీడు- మదనపల్లెకి పోయే పైవే రోడ్డుపై గేటు పెద్దచెరువుకట్ట వద్ద వ్యర్థపదార్థాలు నిండి ఉండటంతో ' ఆ దారిన వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే' అనే శీర్షికతో ఆదివారం ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి యం.సరోజమ్మ, మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.జయరామయ్య గేటును సందర్శించి అక్కడ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులచేత శుభ్రం చేయించారు.ఈ సందర్భంగా సబ్‌యూనిట్ అధికారి మాట్లాడుతూ ప్రజలు భాగస్వామ్యం సహాయ సహకారాలు ఉంటే అందరూ పరిసరాలు పరిశుభ్రతను పాటించవచ్చని దోమల విడదల నివారించవచ్చని వారు తెలిపారు. దోమల పుట్టుకకు మనమే కారణమని పేర్కొన్నారు. అక్కడ వేసిన తడి చెత్త, పొడి చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయించినట్లు తెలిపారు. డ్రైయినేజీ కాలువలు, మురుగు గుంటలలో అబేట్ ద్రావణాన్ని పిచికారి చేసినట్లు తెలిపారు. వర్షాకాలం కావున నీరు నిలిచే ప్రదేశాలను గుర్తించి అక్కడ లార్వా సర్వేలు నిర్వహించి నివారణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి జ్వరపీడితులకు మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సురేంద్రరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు మల్లికార్జున, లక్ష్మీదేవి, ఎంఎల్ హెచ్‌పి పాల్గొన్నారు.

ఆదర్శ రైతు వెంకట్రామరాజుకు డాక్టరేట్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని ఎస్.ఆర్.కండ్రిక గ్రామానికి చెందిన ఆదర్శ రైతు వెంకట్రామరాజుకు బెంగళూరులోని భారత్ వర్చువల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్, జీవితకాల సాఫల్య అవార్డుతో సత్కరించింది. ఆయన సహజ, స్థిర వ్యవసాయంలో అత్యుత్తమ సేవలు, నియామాలకు గుర్తింపుగా అవార్డును ప్రకటించినట్లు వారు తెలిపారు. వెంకట్రామరాజు తన వ్యవసాయ భూమిని సహజ, ఆర్గానిక్, రిజనరేటివ్ వ్యవసాయానికి నమూనాగా మార్చారు. ఆయన సమీకృత విధానం కంపోస్ట్, పశువుల ఎరువు, గ్రీన్ మ్యాన్యూరింగ్, మైక్రోబియల్ ఇనోక్యులెంట్స్, పంట వైవిధ్యం ప్రాంతాల్లోని రైతులకు ప్రేరణనిచ్చిందన్నారు. యువ రైతులకు సేంద్రియ వ్యవసాయం, నీటి సంరక్షణ, కార్బన్-న్యూట్రల్ పద్ధతులను అవలంబించేలా ప్రోత్సహిస్తున్నారని అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ రజాక్ , అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రవి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పలు పాఠశాలలో సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి వెంటనే నియమించాలని, అప్పటి వరకు 30శాతం ఐఆర్ ఇవ్వాలని, పెండింగ్ డిఎలను మంజూరు చేయాలన్నారు. గత ఐదు సంవత్సరాలుగా నిలుపుదల చేసిన సంపాదిత సెలవులను నగదుగా మార్చుకునే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎవి.రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు రవిశంకర్, జిల్లా ట్రెజరర్ గోపాల్‌దాస్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పారితోషికాలు

ప్రజాశక్తి- కలకడ : 'పది' పబ్లిక్ పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించే విద్యార్థులకు పారితోషికాలు అందిస్తామని దాతలు తెలిపారు. మండలంలోని కదిరాయిచెరువు జడ్‌పి హైస్కూల్‌లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తే ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తామని అదే గ్రామానికి చెందిన రత్నయ్య తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేలు పారితోషికం జరుగుతుందన్నారు. కదిరాయి చెరువు గ్రామ సర్పంచ్ కోటకొండ లక్ష్మీ ప్రసన్న కమల్నాథ్ అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.1116లు, రెండవ బహుమతి రూ.516, మూడవ బహుమతి రూ. 516 ప్రతి సంవత్సరం ప్రతి సంవత్సరం అదిస్తున్నట్లు తెలిపారు. గతంలో కూడా ఇదే గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబంలో ఇంజినీంగ్ చదువుతున్న విద్యార్థి పవన్ కుమార్‌కు పి4 ద్వారా ఉన్నత విద్య కోసం రూ.66 వేలు ఆర్థిక సాయం అందించ్చఇనట్లు తెలిపారు. ఇంజినీరింగ్ విద్య కోసం ఆర్థిక సాయం చేసిన దాతలు రామిశెట్టి రత్న డిస్టిక్ సర్వేయర్ రత్నమయ్య, శ్రీనివాసులు, కమలనాథ్.పవన్ కుమార్ విద్యార్థి కి ఇంజనీరింగ్ విద్య పూర్తి అయ్యేంతవరకు ప్రతి సంవత్సరం ఆర్థిక సహాయం అనేది యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. పీలేరు నియోజకవర్గ టిడిపి సర్పంచుల సంఘం అధ్యక్షురాలు కోటకొండ లక్ష్మీ, ప్రసన్న, కమల్నాథ్, కదిరియా చెరువు గ్రామపంచాయతీ అభివృద్ధి కొరకు అర్హత కలిగిన కుటుంబాలకు సంక్షేమ పథకాలు అమలయ్యే విధంగా తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

సిఎంను కలిసిన 'రేవూరి'

ప్రజాశక్తి-రాజంపేట

టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ సోమవారం నారా చంద్రబాబు నాయుడుని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి విద్యార్థి నాయకుల ముసుగు వేసుకొని గంజాయి వ్యాపారం చేస్తుంటే కనీసం వారిని వైసిపి నుంచి సస్పెండ్ కూడా చేయలేదన్నారు. వైసిపి విద్యార్థి విభాగం నాయకులతో వైఎస్ జగన్ సమావేశం ఏర్పాటుచేసి యువతను గంజాయి మత్తుకు అలవాటు చేసే ఉద్దేశంతో వైసిపి విద్యార్థి విభాగానికి శిక్షణ ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడితే జరిగే నష్టాలపై యువతలో చైతన్యం కలిగించేందుకు టిఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నామని సిఎంకు తెలియజేసినట్లు తెలిపారు.

పిపిపి విధానంతో వైద్యవిద్య అందని ద్రాక్షే

ప్రజాశకి-మదనపల్లె అర్బన్ : వైద్య విద్యను, పేదలకు వైద్యాన్ని దూరం చేయడానికే కూటమి ప్రభుత్వం పిపిపి విదానాన్ని తీసుకొచ్చిందని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ విమర్శించారు. సోమవారం మదనపల్లె పట్టణం 17వ వార్డు దేవళం వీధిలో వైసిపి రాష్ట్ర కార్యనిర్వాక కమిటీ సభ్యురాలు షమీమ్ అస్లాం ఆధ్వర్యంలో రచ్చబండ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియో జకవర్గ సమన్వ యకర్త నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్ కుమార్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు అనీషారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మనుజా రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి, పలువురు కౌన్సిలర్లు, శారదారెడ్డి, వైసిపి నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ గత జగన్మోహన్ రెడ్డి వైసిపి ప్రభుత్వ పాలనలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఎపికి జగన్ మోహన్ రెడ్డి తీసుకువస్తే, వైద్య విద్యను, పేదలకు వైద్యాన్ని దూరం చేయడానికి కూటమి ప్రభుత్వం పిపిపి పేరుతో ప్రయివేట్‌కు అప్పగిస్తోందని విమర్శించారు.

NOTICE

నా కక్షి దారుడైన శ్రీ షేక్ ఇంతియాజ్ S/o. షేక్ ఖాదర్ బాష, పీలేరు, క్రింది వ్యక్తుల నుండి 2021-2022 సంవత్సరాలలో చేతి రుణాలు తీసుకొని భద్రత కొరకు ఖాళీ చెక్కులు (ఆంధ్ర బ్యాంకు మరియు స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా) ఇచ్చి యున్నారు, స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా చెక్ నెంబర్లు 874221 నుండి 874229 మరియు సంతకాలు చేసిన ప్రామిసారి నోట్లు 1. షేక్ మస్తాన్, 2.పెద్ది రెడ్డి వెంకట లక్ష్మి 3. గుండ్లూరు గురు ప్రసాద్, 4. షేక్ అన్సర్ బాష, మరియు 5) షేక్ సాదక్ పీర్, పై వారికి నా కక్షి కర్త అన్ని బకాయిలను వడ్డీతో సహా చెల్లించి నారు, భద్రత పత్రాలు తిరిగి ఇవ్వమని కోరగా వారు అవి తప్పి పోయాయని తిరిగి ఇవ్వలేదు. ఈ విషయమై పై వారికి ఇది వరకే లాయరు నోటీసు కూడా ఇవ్వడం జరిగినది.

కాబట్టి ఈ ప్రకటన ద్వారా తెలియచేయడం ఏమనగా పైన పేర్కొన్న చెక్కులు మరియు ప్రామిసారి నోట్లు రద్దు చేయబడ్డాయి అవి ఇక పై చెల్లు బాట కానివి ఎవరైనా పై పేర్కొన్న చెక్కులు గాని ప్రామిసారి నోట్లు గాని ఉపయోగిం చిన యెడల వారి పై చట్ట రీత్యా చర్యలు తీసుకోనబడుతాయి.

తోట ప్రవీణ్ కుమార్
అడ్వకేట్, పీలేరు.

జిల్లా కేంద్రానికి మదనపల్లె పేరునే కొనసాగించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నూతనంగా ఏర్పాటు కాబోతున్న మదనపల్లె జిల్లా కేంద్రానికి మదనపల్లె పేరునే కొనసాగించాలని టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి మదనపల్లికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అప్పట్లోనే మదనపల్లిలో సబ్ కలెక్టర్ కార్యాలయం, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయం ఉండేవన్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆరోగ్యవర్గం మెడికల్ సెంటర్, అనిబిసెంట్ ఏర్పాటు చేసిన వందేళ్ల చరిత్ర కలిగిన బిటి కళాశాల ఈ ప్రాంతానికి తలమానికంగా ఉన్నాయన్నారు. గత వైసిపి ప్రభుత్వం జిల్లాల పునర్విభజనలో మదనపల్లెకు అన్యాయం చేసిందని, అప్పట్లో మదనపల్లి జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో అప్పటి ప్రతిపక్ష టిడిపి వామపక్షాలు, ప్రజా సంఘాలు మదనపల్లి జిల్లా కోసం ఉద్యమించాయని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు జిల్లాల పునర్విభజనపై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసిందన్నారు. మంత్రివర్గ ఉపసంఘం మదనపల్లి జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలపడంతో ఇక్కడి ప్రజల దశాబ్దాల కల నెరవేరినట్లు అయిందన్నారు. మదనపల్లి జిల్లా ఏర్పాటుకు సానుకూల సంకేతాలు రావడంతో పలు కుల సంఘాలు వారి కులానికి చెందిన ప్రసిద్ధిగాంచిన వారి పేర్లు పెట్టాలని తీసుకొస్తున్నారన్నారు. ముఖ్యంగా విద్యా సంఘాలు, విద్యావేత్తలు రవీంద్రనాథ్ ఠాగూర్, అనిబిసెంట్, జిడ్డు కృష్ణమూర్తి పేరు పెట్టాలని, బలిజ సంఘం నాయకులు శ్రీకృష్ణదేవరాయలు, ముస్లిం మైనార్టీ నాయకులు టిపూ సుల్తాన్, రెడ్డి సంఘాల నాయకులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, కురబ సంఘం నాయకులు కనకదాస, వడ్డెర సంఘం నాయకులు వడ్డెర ఓబన్న, రజక సంఘం నాయకులు చాకలి ఐలమ్మ, పాలఏకరి సంఘం నాయకులు మర్యాద రామన్న, బిసి సంఘాలు జ్యోతిరావు పూలే, వైశ్య సంఘాలు వారు టంగుటూరి గోపాలకృష్ణ, కమ్యూనిస్టులు సీతారామయ్య పేర్లు పెట్టాలని ఇలా ఎవరికి వారు తమకు తోచిన పేర్లను మదనపల్లి జిల్లాకు నామకరణ చేయాలనడం సహేతుకం కాదన్నారు. ఒక కులానికి చెందిన ప్రముఖ వ్యక్తి పేరు మదనపల్లి జిల్లాకు పెడితే సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, కావున అందరికీ ఆమోదయోగ్యమైన మదనపల్లి జిల్లాకు మదనపల్లి పేరునే కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న ఆర్‌జె.వెంకటేష్

పీలేరులో 'నాన్న డైరీ' చిత్ర నిర్మాణం

ప్రధాన నటుడు ఆల్ ది బెస్ట్ ఖాదర్‌పై క్లాత్ ఇస్తున్న నిర్మాత కోటి పాలకుంట

ప్రజాశక్తి- పీలేరు

పీలేరులో నాన్న డైరీ చిత్ర నిర్మాణం ప్రారంభమైంది. సోమవారం మండలంలోని అగ్రహారం శ్రీఅష్టలక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజా కార్యక్రమంతో పాటు చిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఆల్ ది బెస్ట్ ఖాదర్ డైలాగ్‌కు నిర్మాత కోటి పాలకుంట క్లాప్ ఇచ్చి సినిమా చిత్రీకరణ ఆరంభించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబ జీవితం నేపథ్యంతో తండ్రీ కొడుకుల ఎమోషనల్ సెంటిమెంట్ కథాంశంతో నాన్న డైరీ' టైటిల్ కు ప్రతి పేజీ వెనక ఓ కన్నీటిగాథ సబ్ టైటిల్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. మరో మూడు రోజుల్లో పీలేరు పరిసర ప్రాంతాల్లో చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఉంటుందని మీడియాకు తెలిపారు. ముఖ్యంగా పీలేరు ప్రాంత కళాకారులను ప్రోత్సహిస్తూ నటీనటులుగా ఈ చిత్రంలో అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. ఈ చిత్రానికి ఆనంద్ తంగేళ్ల కథ, మాటలు సమకూర్చగా సురేష్ గండికోట స్క్రీన్ ప్లే, దర్శకత్వం, సుహేల్ సహ దర్శకత్వం, ఫజరుల్లా సహాయ దర్శకత్వం, ఎఆర్ రాఖి కెమెరా, తిలక్ నాయక్ ఎడిటింగ్ అందిస్తున్నారు. ఈ చిత్రంలో టైటిల్ రోల్ లో 'ఆల్ ది బెస్ట్' ఖాదర్, కథానాయకుడిగా చాను, కథానాయిక గా సనా, ఇతర పాత్రల్లో బాబ్జాన్, తరిగొండ రాధాకృష్ణ, జాఫర్, ప్రశాంతి, ఆరాధ్య, నీలిమ, జాఫర్, రామకృష్ణ, హర్షద్, గోపివాసు, ఎంఎన్ నాయుడు, తదితరులు నటించనున్నారు. కార్యక్రమానికి ది బ్రెయిన్ సినిమా నిర్మాత, హీరో జయచంద్ర నాయుడు, 'ఇది ఎంత కథ' సినిమా హీరో జగదీష్, రచయిత, కళాకారుడు కటారి రామయ్య, మాజీ ఎంపిటిసి భాను ప్రకాష్ రెడ్డి, నీలిమారెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు పలువురు స్థానిక నటీనటులు పాల్గొన్నారు.

ప్రత్యూష హైస్కూల్లో వనభోజనాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మూడవ కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యూష హై స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి శ్రీ కనకదుర్గమ్మ తిరుణాల ఆవరణంలో వేడుకగా కార్తీక మాస వనభోజనాలను జరుపు కున్నారు. ఈ వేడుకలలో భాగంగా విద్యార్థులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. పిల్లలకు అల్పాహారమును అందించారు. ఆర్గనైజర్లు వాకచర్ల రవీంద్రబాబు, నూకల రాధ మాట్లాడుతూ ఈ వేడుకలను మా పాఠశాలలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ టివి. రాజశేఖర్, హెచ్‌ఎం గంజి సుబ్బ నరసింహులు, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, మహబూబ్బి, నందిని, శ్రావణి, రెడ్డమ్మ, రజిని, దివ్య, బాబి, నిషిత, నీలవేణి, సరళమ్మ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

-సబ్ యూనిట్ అధికారి జి.జయరామయ్య

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

సీసనల్ వ్యాధులపట్ల ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉంచాలని లక్కిరెడ్డిపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.జయరామయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక సిహెచ్‌సిలో లక్కిరెడ్డిపల్లి మలేరియా సబ్ యూనిట్ పరిధిలో గల 6 పిహెచ్‌సిల హెల్త్ అసిస్టెంట్ లతో సీజనల్ వ్యాధుల నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి జి. జయరామయ్య మాట్లాడుతూ పురుష ఆరోగ్యకార్యకర్తలు తమకు కేటాయించిన గ్రామాలను సందర్శించి లార్వా, జ్వరాల సర్వేలను నిర్దేశించిన ఫార్మేట్ ప్రకారం నిర్వహించాలన్నారు. జ్వరపు కేసులను గుర్తించి వారి నుంచి రక్త నమూనాలను సేకరించాలని, రోగి పరిస్థితిని బట్టి రెఫెర్ చేయాలని, అనుమానిత జ్వరపీడితులనుండి కూడా సాంపిల్స్ సేకరించి పి.హెచ్. సి లోని ల్యాబ్ కు పంపాలని పైపు లైన్ లీకేజిలను గుర్తించి పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లాలని, మరమ్మతులు చేయించాలని చెప్పారు. గ్రామాల్లోకి అపరిశుభ్ర పారిశుద్య వాతావరణం ఉంటే డ్రెయినేజీ బ్లాక్, దిబ్బలు, ట్యాంక్ క్లీనింగ్ అంటువ్యాధులు ప్రభలే అవకాశం ముందన్నారు. అటువంటి పరిస్థితి ఉంటే పంచాయతీ రాజ్ శాఖ నోటీస్‌కు తీసుకు పోవాలన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కోసం లైన్ డిపార్ట్మెంట్ల సహాయం తీసుకొని వ్యాధులు ప్రబలకుండా చేయవలసిన భాద్యత మనందరి పైన ఉందని చేసిన పనికి డాకుమెంటేషన్ ఉంచుకోవాలని సూచించారు. డెంగీ, మలేరియా పాజిటివ్ కేసులు వస్తే రెస్పాన్స్ టీమ్ సిద్ధంగా ఉండాలని హెచ్చరిక చేశారు. ఫ్రైడే డ్రైడే నిక్కచ్చిగా అమలు చెయాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో గాలివీడు, నూలివీడు, వీరబల్లి, దేవలం పల్లి, కోణంపేట రామాపురం పిహెచ్‌సిల పరిధిలో పనిచేసే పురుష ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విస్తరణకు పాటుపడాలి

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్

ప్రకృతి వ్యవసాయం విస్తరణకు టిఐసిఆర్‌పిలు మరింతగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా చీఫ్ అధికారి విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ న్యాచురల్ ఫామింగ్ ఆధ్వర్యంలో టిఐసిఆర్ పిలకు రెండవ విడత శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. శిక్షణలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో ప్రకృతి వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందుతారన్నారు. భూమిసారంను కాపాడుతూనే పర్యావరణంను సంరక్షించు కోవచ్చు అన్నారు. డిఎఒ శివనారాయణ మాట్లాడుతూ టిఐసిఆర్‌పిలు గ్రామస్థాయిలో రైతులకు మార్గదర్శకులు కావాలి మార్గదర్శకులుగా వ్యవహరించాలని కోరారు. రైతుల్లో సేంద్రియ పద్ధతులపై అవ గాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి సిబ్బంది, టిఐసిఆర్ పిలు పాల్గొన్నారు.

పొత్తపి గ్రామ అభివృద్ధికి కృషి :'చమర్తి'

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని మారుమూల ప్రాంతమైన పొత్తపి గ్రామ అభివృద్ధికి సహకరిస్తామని రాజంపేట అసెంబ్లీ టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం పొత్తపి గ్రామానికి విచ్చేసిన చమ్మర్తిని టిడిపి సీనియర్ నాయకులు మోదుగుల పెంచలయ్య, కార్యకర్తలు, గ్రామస్తులు దుశ్శాలువాతో కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామమైన పొత్తపి గ్రామం చాలా వెనకబడి ఉందన్నారు.గ్రామంలో పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పిల్లలకు సరైన విద్యా బోధన అందించి పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. శివాలయం దగ్గర గ్రామస్తులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సోమశిల బ్యాక్ వాటర్ ను పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు జంగం శెట్టి సుబ్బయ్య, క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్, కో క్లస్టర్ సర్పంచ్ యానాది, టిడిపి నాయకులు రమణయ్య, శివయ్య, దొరబాబు, భాస్కర్, ఎం రమణయ్య, ఆర్కే చైతన్య టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పవన్‌పై వైసిపి విమర్శలు తగవు

ప్రజాశక్తి-పీలేరు : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై వైసీపీ నాయకుల విమర్శలు చేయడం తగదని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కలప రవి తెలిపారు. సోమవారం ఆయన పీలేరులో మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 8, 9 తేదీల్లో చిత్తూరు జిల్లాలో పర్యటించిన విషయం పాఠకులకు విధితమేనన్నారు. ఈ సందర్భంగా పవన్ కుంకీ ఏనుగుల శిక్షణ శిబిరాన్ని ప్రారంభించడం జరిగిందని, ఏనుగులు పంట నష్టం, ప్రాణ నష్టం చేయకుండా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై అటవీ శాఖ అధికారులను సూచించారని అన్నారు. దీన్ని జీర్ణించుకోలేని వైసిపి నాయకులు కొందరు ఆయనను ఉద్దేశించి సినిమా షూటింగ్‌లకు వచ్చి వెళుతున్నట్లు విమానాల్లో పర్యటనలు చేస్తున్నారంటూ విమర్శించడం సరికాదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని, ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుతూ ప్రజలకు చేరువ అవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ గోళ్ళ కిషోర్ నాయుడు, జనసేన పార్టీ పీలేరు మండల కార్యదర్శి రాజేష్, చిరంజీవి, యువత అధ్యక్షులు మణి, గాలి మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అట్లాస్ మ్యాపులు వితరణ

ప్రజాశక్తి- కలకడ : పి4పథకం ద్వారా విద్యార్థులకు ప్రపంచ అట్లాస్ మ్యాపులు వితరణ చేసినట్లు సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న కమలనాథ్ తెలిపారు. సిఎం చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 అమలులో భాగంగా ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు కదిరాయచెరువు గ్రామపం చాయతీలో ఉన్నటువంటి జడ్‌పి హైస్కూల్‌లో 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న మొత్తం విద్యార్థులకు ప్రపంచ అట్లాస్ మ్యాపులు అందించినట్లు తెలిపారు. ప్రత్యేకించి పదవ తరగతి చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థి మెరుగ్గన ఫలితాలు సాధించాలనే ఆశయంతో దాత రత్నమయ్య రూ.16వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్స్ ఉచితంగా అందించారని తెలిపారు. కార్యక్రమంలో పాధ్యాయులు, విద్యార్థులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

మండలంలో అధికారుల పర్యటన

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి :యువ యుపిఎస్‌సి అధికారులు సోమవారం లక్కిరెడ్డిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు రోజులపాటు లక్కిరెడ్డిపల్లి మండలంలోని బిఎర్రగుడి, దిన్నే పాడు, కుర్నూతుల గ్రామాలను సందర్శించు నున్నారని తెలిపారు. గ్రామాలలో విద్య వైద్యం, తాగునీరు సరఫరా తదితర అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యువ అధికారులు తరుణ్ యాదవ్ ఐపిఎస్, హర్షవర్ధన్ ఐఎఫ్ఎస్ ,తన్మయ జహా ఐఆర్ఎస్, సౌరబ్ కుమార్ ఐఆర్ఎస్ , తనక ఆనంద్ ఐఆర్ఎంఎస్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం బి.ఎర్రగుడి సచివాలయం సందర్శించి గ్రామస్తులు మాట్లాడి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి రెడ్డయ్య, ఇఒపిఆర్‌డి, ఎపిఎస్‌పిడిసిఎల్ ఎఇ, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

16న మాలమహానాడు రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-పీలేరు : మాలమహానాడు రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పీలేరులో ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న ఆదివారం అన్నమయ్య జిల్లా, మదనపల్లిలోని సిఎస్ఐ జె సి ఎం కమ్యూనిటి హాలులో జరిగే మాలమహానాడు రాష్ట్ర మహాసభకు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, రాష్ట్రాల మాల మేధావులు, సామాజిక కార్యకర్తలు, హాజరుకానున్నారని అన్నారు. ఈ సభ విజయవంతం చేయడానికి చిత్తూరు, అన్నమయ్య జిల్లాల మాలమహానాడు కార్యకర్తలు, నాయకులు కలసికట్టుగా పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గోడపత్రికలను ఆవిష్కరించారు. పీలేరు మాలమహానాడు మండల ప్రచార కార్యదర్శి పులిచెర్ల నాగేంద్ర, ఆధ్వర్యంలో నాలేవాండల్ల పల్లి ఎస్సీ కాలనీలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగరాజు, భాస్కర్, రాజు, హరిక్రిష్ణ, ప్రసాద్, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్ర స్వామి రథోత్సవం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మండలంలోని చిన్న మాచిరెడ్డిగారిపల్లెలో ఉన్న వీరభద్ర స్వామి ఆలయంలో రథోత్సవం వైభవంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఆలయం వద్ద కన్నెమడుగు దాయాదులు 39 కుటుంబాల పిల్లలకు తలనీలాలు సమర్పించారు. రాత్రి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

సిఎన్‌ఆర్ డయాగ్నస్టిక్‌ను ప్రారంభించిన 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట

పట్టణంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ పక్కన నూతన సిఎన్‌ఆర్ డయాగ్నస్టిక్ కేంద్రాన్ని డాక్టర్ గిరిధర్ ఆహ్వానం మేరకు సోమవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో ప్రజలకు పలు సేవలను అందుబాటులో ఉంచడం, అలాగే ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భూముల వద్ద పెట్రోలు క్యాన్‌తో నిరసన తెలుపుతున్న రైతులు

సాగు భూములను అప్పగించం

-పెట్రోల్ క్యాన్‌తో రైతుల నిరసన

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండల పరిధిలోని రెడ్డికోట వద్ద ఎపిఐఐసికి ప్రభుత్వం కేటాయించిన భూములను పరిశీలించేందుకు అధికారులతో కలసి సోమవారం తహశీల్దార్ శ్రీనివాసులు వెళ్లారు. రైతులు అధికారులను అడ్డుకుని తాము సాగుచేసుకుంటున్న భూములను అప్పగించమని రోడ్డుపై భైఠాయించి నిరసన చేపట్టారు. తాము కొన్ని ఏళ్లుగా సాగు చేసుకుని బతుకుతున్నామని భూములను స్వాధీనం చేసుకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని పెట్రోలు క్యాన్‌తో నిరసనలు తెలిపారు. గతంలో పర్లగొల్లపల్లె వద్ద 20ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. కలెక్టర్ కల్యాణి అధికారులతో కలసి భూముల పరిశీలనకు వెళ్లారు. ఆ భూములను కొన్నేళ్లుగా సాగుచేసుకుంటున్నామని, ప్రభుత్వం వాటిని తీసుకుంటే రోడ్డున పడతామని సబ్ కలెక్టర్ ఎదుట రైతులు వాపోయారు.

సాహితీ శిఖరం అందెశ్రీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : నిరక్షరాస్యుడైనా పశువుల కాపరి నుండి, తెలంగాణ రాష్ట్ర గీతం అందించే స్థాయికి ఎదిగిన గొప్ప సాహితీ శిఖరం మహాకవి అందెశ్రీ అని, భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) జాతీయ కన్వీనర్ పిటిఎం శివప్రసాద్ అన్నారు. మహాకవి అందెశ్రీ హఠాన్మరణంపై సంతాపం వ్యక్తం చేస్తూ, సోమవారం బాస్ కార్యాలయంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్ మాట్లాడుతూ పశువులు మేపుతూ, నిర్మాణ రంగంలో కూలిగా పనిచేస్తూ, శ్రమ సౌందర్యం నుండి, ప్రకృతి పలకరింపుల నుంచి, జనం ఘోషల నుండి, జనం భాషల నుంచి, కురుమ సద్దుల గజ్జల సవ్వడి నుండి సహజకవిగా మారి, మహాకవిగా అవతరించిన అందెశ్రీ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొంది తన అపారమైన సాహితీ సౌరభాన్ని ఎలుగెత్తి చాటారన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్‌బిఐ ఉద్యోగి మంచూరి మారెప్ప, బాస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్ లతో పాటు బాస్ నాయకులు సొన్నికంటి రెడ్డెప్ప, డేగాని రమణ, వై. గంగాధర్, బురుజు జనార్దన్ పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

ప్రజాశక్తి-వీరబల్లి

క్రీడల వల్ల స్నేహాభావాన్ని పెంపొందించుకోవడానికి దోహదపడతాయని ఎస్‌డికెఆర్ డిగ్రీ కళాశాల డైరె క్టర్ రవిశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎస్‌డికెఆర్ డిగ్రీ, డిజి కళాశాలలో మై భారత్, విఆర్‌డిఎస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుడ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు.క్రీడలపై ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకోవాలని కోరారు. విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతు గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు మై భారత్ చేస్తున్న కృషి వెలకట్టలేనిదన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఈ పోటీలలో ఆరు టీంలు పాల్గొన్నాయి. విన్నర్స్‌గా సాయి టీమ్, రనర్స్‌గా ఎస్‌డికెఆర్ టీమ్ గెలుపొందాయి. గెలుపొందిన క్రీడాకారులకు సురేంద్రారెడ్డి ప్రశంసా పత్రం, మెమోంటో, బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో అంపైర్లు రుక్సర్, మస్తాన్,కళాశాల సిబ్బంది శ్రీహరి, రమణ, హర్షద్, కిషోర్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న అగ్నిమాపక కానిస్టేబుల్

ప్రజాశక్తి-రాజంపేట

అగ్నిమాపక కేంద్రంలో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న సుబ్రమణ్యం తన నిజాయితీని చాటుకున్నారు. ఈనెల 8న ఎడిబి బ్యాంక్‌కు సంబంధించిన ఎటిఎంలో డబ్బులు డ్రా చేసుకునేందుకు వెళ్ళాడు. ఎటిఎం మిషన్‌లో రూ 10,500 నగదు బయటకు వచ్చివున్న విషయాన్ని గుర్తించాడు. ఎటిఎం బయట ఎవరూ లేకపోవడంతో ఆ నగదును తీసుకుని తనవద్ద ఉంచుకున్నాడు. శని, ఆదివారాలు సెలవు కావడంతో సోమవారం బ్యాంక్ మేనేజర్‌కు డబ్బులు అప్పజెప్పారు. బ్యాంక్ మేనేజర్ సిసి ఫుటేజీలను పరిశీలించగా ఆ నగదు ఓ మహిళకు చెందినదిగా గుర్తించి కానిస్టేబుల్ సుబ్రమణ్యం చేతుల మీదుగా ఆ మహిళకు నగదును అందించారు. హెడ్ కానిస్టేబుల్ నిజాయితీకి పలువురు అభినందనలు తెలిపారు.

క్రైం కార్నర్

హత్యకేసులో నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

హత్యకేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎపిలో హత్యలు, దోపిడీలు, ఎర్రచందనం, గంజాయి, స్మగ్లింగ్ వంటి 18 కేసుల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ గా ఉన్న హంతకుడు సుల్తాన్‌తో పాటూ అతడి ముఠాను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నిందితుల అరెస్టుకు సంబంధించి జిల్లా ఎస్పి ధీరజ్ కునుబిల్లి, డిఎస్పి మహేంద్ర ఆదేశాలతో ఒకటో పట్టణ సిఐ మహమ్మద్ రఫి వివరాలను వెల్లడించారు. మదనపల్లె పట్టణం, దేవళం వీధికి చెందిన సుల్తాన్, రబ్బాని, సాదిక్, ఆసిఫ్, మౌలా ఆగస్టు15న అంగళ్ళులో కూలీపని చేసుకుంటూ జీవనం సాగించే వెస్ట్ బెంగాల్ కు చెందిన యువకుడు షేక్ ఖదీర్‌ను హత్య చేసి 16 న సిటిఎం రైల్వే ట్రాక్ పై పడేశారని తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్పి ఆదేశాల మేరకు మూడు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు సాగించామని చెప్పారు. గంజాయి సరఫరా నేపథ్యంలో వెస్ట్ బెంగాల్ యువకుడు ఖదీర్‌ను సుల్తాన్ అతని ముఠా సభ్యులు రబ్బాని, సాదిక్, ఆసిఫ్, మౌలా అత్యంత దారుణంగా కొట్టి హత్య చేశారని దర్యాప్తులో తేలడంతో వారిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరితో పాటూ హత్య సమయంలో ఉపయోగించిన ఇతియోస్ కారును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సుదీర్ఘ నేర చరిత్ర కలిగి, హత్యలు, దోపిడీలు, స్మగ్లింగ్, ఎర్రచందనం, గంజాయి వంటి 18 కేసుల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా ఉన్న సుల్తాన్ పై పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు ఎస్పికి సిఫారసు చేస్తున్నట్లు డిఎస్పి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కలికిరి

కలికిరిలో వ్యక్తి అనుమానాస్పద మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం ఇందిరమ్మ కాలనీ సమీపంలోని ఒక తోపులో ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతుడు ఇందిరమ్మ కాలనీలో ఉండే ముల్లంగి రమేష్ (55) గా గుర్తించారు. హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్ అలీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రమేష్ అతిగా మద్యం సేవించి మృతి చెందాడా, లేక పాత కక్షల వల్ల ఎవరైనా ఏమైనా చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మృతదేహాన్ని కలికిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు.